

ఎగ్జిబిషన్‌లో చేనేత వస్తువులను కొనుగోలు చేస్తున్న మహిళలు

ఆకట్టుకుంటున్న హ్యాండ్లూమ్, హ్యాండీక్రాఫ్ట్ మేళా

వనస్థలిపురం, జూలై 5(ఆంధ్రజ్యోతి): వనస్థలిపురం ఒవెన్ కమ్యూనిటీ హాల్లో ఏర్పాటు చేసిన ఆల్‌ఇండియా హ్యాండ్లూమ్ అండ్ హ్యాండీక్రాఫ్ట్ మేళా ఎగ్జిబిషన్ అండ్ సేల్ విశేషంగా ఆకట్టుకుంటుంది. ఈ ఎగ్జిబిషన్‌లో మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరిశారీస్, భాగల్‌పూర్‌శారీస్, డిజైనర్‌శారీస్, కాంతావర్క్స్‌శారీస్, హ్యాండ్ బ్లాక్ ప్రింటెడ్‌శారీస్, లినెన్‌శారీస్, కలంకారీశారీస్, బెంగాల్ కాటన్‌శారీస్, లేడీస్ ఫ్యాన్సీ టాప్స్, డిజైనర్ బ్లౌజ్, లక్నో చికెన్, బనారస్ శారీస్, ఖాదీ మెటీరియల్, వన్ గ్రామ్ గోల్డ్ జ్యూవెల్లరీ, జైపూర్ బెడ్ షీట్స్ కొండపల్లి టాయ్స్, ఇతర అనేక చేనేత ఉత్పత్తులు ప్రదర్శనలో ఉంచారు. ఈ సందర్భంగా నిర్వాహకులు అక్బర్‌అలీ మాట్లాడుతూ చేనేత కళాకారులను ఆదుకునేందుకు ఏర్పాటు చేసిన హస్త కళా ప్రదర్శనను ఎల్బీనగర్ పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దేశవ్యాప్తంగా పేరుగాంచిన చేనేత ఉత్పత్తులను తమ ఎగ్జిబిషన్‌లో ఉంచామన్నారు. అన్ని వర్గాల ప్రజలు కొనుగోలు చేసే విధంగా చేనేత ఉత్పత్తుల ధరలను అందుబాటులో ఉంచామని తెలిపారు. ఈ ప్రదర్శన ప్రతి రోజు ఉదయం 10.30ల నుంచి రాత్రి 9గంటల వరకు కాలనీవాసులకు అందుబాటులో ఉంటుందని అక్బర్‌అలీ పేర్కొన్నారు.

శంకర్‌నగర్ సమస్యల పరిష్కారానికి కృషి

ఎల్బీనగర్, జూలై 5(ఆంధ్రజ్యోతి): శంకర్‌నగర్ బస్తీవాసులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మాజీమంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. శుక్రవారం సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని శంకర్‌నగర్‌లో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆమెకు విన్నవించుకున్నారు. బస్తీవాసుల సమస్యలను విన్న సబితారెడ్డి పరిష్కారమయ్యేలా చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో సరూర్‌నగర్ సర్కిల్ ఉప కమిషనర్ సుజాత, శానిటేషన్ డీఈ నీలిమ, లోకసాని కొండల్‌రెడ్డి, ఇంటూరి అంకిరెడ్డి, ఆకుల అరవింద్‌కుమార్, దర్పల్లి అశోక్, కేశవరెడ్డి, పోలె అరవింద్, కట్ట ప్రవీణ్, రిషి పాల్గొన్నారు.



ఎల్‌ఓసీ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

సీఎం రిలీఫ్ ఫండ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

● ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం, జూలై 5(ఆంధ్రజ్యోతి): ఆరోగ్య పరిరక్షణకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతగానో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. నాగోల్ డివిజన్ సాయిభవానినగర్‌కు చెందిన శివకుమార్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తలకు గాయాలైనాయి. వారి కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగలేదు. దీంతో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సహకారంతో సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నారు. అందుకు గాను మంజూరైన ఒక లక్ష రూపాయల ఎల్‌ఓసీ చెక్కును బాధితుని తండ్రి యాదయ్యకు ఎమ్మెల్యే తన కార్యాలయంలో శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అత్యాధునిక వైద్య సేవలు పొందడానికి సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు అనంతుల రాజిరెడ్డి, ప్రశాంత్‌గౌడ్, చిరంజీవి, రవి, యాదగిరి పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో ఆక్రమణల కూల్చివేత

సరూర్‌నగర్, జూలై 5(ఆంధ్రజ్యోతి): బాలాపూర్‌లోని సర్వే నంబర్.74లో గల ప్రభుత్వ భూమిని స్థానికులు కొందరు ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నట్టు ఫిర్యాదులు రావడంతో రెవెన్యూ అధికారులు శుక్రవారం సదరు భూమిని సర్వే చేసి హద్దులు నిర్ణయించారు. అనంతరం అక్కడ చేపట్టిన నిర్మాణాలను కూల్చివేసి, 'ఇది ప్రభుత్వ భూమి' అని పేర్కొంటూ బోర్డు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ భూములను ఎవరు ఆక్రమించినా ఉపేక్షించేది లేదని, చట్టాలను ధిక్కరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

నూతన పార్కు, వాకింగ్ ట్రాక్ పనుల పరిశీలన

వనస్థలిపురం, జూలై 5(ఆంధ్రజ్యోతి): కాలనీవాసుల ఆరోగ్య పరిరక్షణకు పార్కులు, వాకింగ్ ట్రాక్‌లు ఉపయోగపడతాయని కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం వనస్థలిపురం డివిజన్‌లోని మల్లికార్జుననగర్ కాలనీలో నూతనంగా చేపట్టబోయే పార్కు, వాకింగ్ ట్రాక్ పనులను కార్పొరేటర్ కాలనీవాసులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమంలో ఏఈ ప్రజ్ఞ, కాలనీవాసులు పాల్గొన్నారు.

సీసీ రహదారి పనులను నాణ్యతగా చేపట్టాలి

చంపాపేట, జూలై 5(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్‌లోని మాధవనగర్‌కాలనీలో కొనసాగుతున్న సీసీ రహదారి నిర్మాణ పనులను కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాధవనగర్‌కాలనీ, శ్రీనిధికాలని, కర్మన్‌ఘాట్ ఓల్డ్‌విలేజ్‌లో సీసీ రహదారి నిర్మాణ పనులకు జీహెచ్‌ఎంసీ నిధులు రూ.93లక్షలు మంజూరైనట్లు తెలిపారు. అనంతరం కాలనీలో కమ్యూనిటీహాల్ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ సురేష్, కాలనీ అధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి, కాలనీప్రతినిధులు అనసూయ, విజయసేనారెడ్డి, సత్తయ్య, శంబుప్రసాద్, ముత్యాలు, నర్సింహారెడ్డి, పోరెడ్డి రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

డ్రైనేజీ, మంచినీటి సమస్యల పరిష్కారానికి చర్యలు

సైదాబాద్: ఐఎస్‌సదన్ డివిజన్‌లో డ్రైనేజీ, మంచినీటి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం జలమండలి జనరల్ మేనేజర్ సరిత, మేనేజర్ రమ్యతో కలిసి సింగరేణి వాంబే కాలనీలో రోడ్డుపై పారుతున్న డ్రైనేజీ నీరును పరిశీలించారు. బస్తీలతో పాటు పలు కాలనీలలో లోప్రెషర్ నీటి సరఫరా, మురుగు సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని కార్పొరేటర్ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.

నేషనల్ స్పేస్ సొసైటీ యూఎస్ఏ డిబేట్-2024లో మొదటి స్థానంలో నిలిచిన జోగ నైతిక సాయి

చాదర్‌ఘాట్, జూలై 5(ఆంధ్రజ్యోతి): నేషనల్ స్పేస్ సొసైటీ యూఎస్ఏ డిబేట్-2024లో పాల్గొన్న శ్రీచైతన్య స్కూల్ దిల్‌సుఖ్‌నగర్ బ్రాంచి 9వ తరగతి విద్యార్థిని జోగ నైతిక సాయి జాతీయ స్థాయిలో ప్రథమ స్థాయిలో నిలిచింది. ప్రపంచ వ్యాప్తంగా ఇండియా, మెక్సికో, పెరూ, రుమేనియా, సిరియా, సౌత్ కొరియా, టర్కీ, యూఎస్ఏ తదితర 9దేశాలకు చెందిన విద్యార్థులు ఈ డిబేట్‌లో పోటీపడగా జోగ నైతిక సాయి ప్రథమ స్థానంలో నిలిచి తన ప్రతిభను చాటుకుంది. లాస్ ఏంజిల్స్‌లో జరిగిన సభలో ఎన్ఎస్ఎస్ ప్రెసిడెంట్ ఆఫ్ ఎడ్యుకేషన్ లైనే ఎఫ్ జీలిన్‌స్కి ప్రథమ స్థానంలో నిలిచిన జోగ నైతిక సాయిని ప్రశంసించారు. ఈసందర్భంగా పాఠశాలలో జరిగిన అభినందన సభలో డీఆర్‌డీఎల్ శాస్త్రవేత్త మునగాల వెంకట నరేష్, పాఠశాల ఏజీఎం సతీష్ ఘనంగా సన్మానించారు. ప్రిన్సిపాల్ ఉమ, కోర్డినేటర్ జితేందర్, ఆర్ఐ వెంకటరెడ్డి, డీన్ శ్రీను, ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

బీజేవైఎం నేతల అరెస్టులను ఖండించిన బీజేపీ

అబ్దుల్లాపూర్‌మెట్, జూలై 5(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శాంతియుత నిరసనకు పిలుపునిస్తే ముందస్తు అరెస్టులు చేయడం దారుణం అని బీజేపీ అబ్దుల్లాపూర్‌మెట్ మండల అధ్యక్షుడు బండిగారి విష్ణుగౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేవైఎం అబ్దుల్లాపూర్‌మెట్ మండల అధ్యక్షుడు కట్ట సాయికిరణ్‌తో పాటు పలువురిని గురువారం రాత్రి ముందస్తు అరెస్టు చేసిన పోలీసులు శుక్రవారం ఉదయం అబ్దుల్లాపూర్‌మెట్‌కు తరలించారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన బీజేపీ నాయకులు బీజేవైఎం నేతలకు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మహిళ మోర్చా నాయకురాలు బొడిగె రమాదేవి, నాయకులు పాపయ్యగౌడ్, శ్రావణ్, సురేష్, సురేఖ, శ్రీలత, సత్యనారాయణ, నాగరాజు, రామకృష్ణ, సాయికిరణ్‌గౌడ్ పాల్గొన్నారు.

మురుగు పరుగుతో దోమల విజృంభణ

● వ్యాధుల బారిన ప్రజలు

జోన్‌బృందం, జూలై 5(ఆంధ్రజ్యోతి): వర్షాకాలం మొదలైంది. రోడ్లపై, పక్కన పడిన గుంతల్లో వర్షం నీరు నిలవడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. అంతే కాకుండా పారిశుధ్య నిర్వహణ సరిగా లేకపోవడంతో చెత్త పేరుకుపోయి అక్కడ కూడా దోమలు వృద్ధి చెందుతున్నాయి. పరిసర ప్రాంతాల్లోని ఇళ్లలోకి చొరబడుతున్న దోమలు ప్రజలపై దండయాత్ర చేస్తున్నాయి. దోమల కాటుతో ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. దోమల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు చేపట్టడంలో జీహెచ్‌ఎంసీ నిర్లక్ష్యం వహిస్తుండటంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇప్పటికైనా జీహెచ్‌ఎంసీ ఎంటమాలజి సిబ్బంది దోమలు వృద్ధి చెందకుండా నీరు నిలిచిన గుంతల్లో, చెత్త పేరుకుపోతున్న ప్రాంతాల్లో యాంటీలార్వా మందులను పిచికారీ చేయాల్సిన అవసరం ఉంది. అంతే కాకుండా కాలనీలు, బస్తీలలో ఫాగింగ్ చేయాల్సిన అవసరం ఎంతో ఉంది. ఎల్బీనగర్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాలలో దోమల దండయాత్ర మొదలైంది.

లింగోజిగూడ డివిజన్‌లో..

వనస్థలిపురం, హస్తినాపురం, బైరామల్‌గూడ తదితర ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న మురుగునీరు గ్రీన్‌పార్క్‌కాలనీ సమీపంలో సరూర్‌నగర్ చెరువులో కలుస్తుండటంతో అక్కడ మురుగు పేరుకుపోయి దోమల వృద్ధికి కారణమవుతున్నాయి. దోమల వల్ల లింగోజిగూడ డివిజన్ పరిధిలోని గ్రీన్‌పార్క్‌కాలనీ, తపోవన్‌కాలనీ, త్రిమూర్తికాలనీ, తదితర ప్రాంతాలలో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

వనస్థలిపురం, బీఎన్‌రెడ్డినగర్‌లలో..

వనస్థలిపురం, బీఎన్‌రెడ్డినగర్, మన్సూరాబాద్,



చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ విలేజ్ నుంచి గాయత్రీ నగర్ చౌరస్తా వెళ్లే దారిలో రహదారి పక్కన చెత్తకుప్పలు



ఎన్జీవోస్ కాలనీలో రోడ్డు పక్కల పేరుకపోయిన చెత్త

నాగోల్ డివిజన్‌లలో ప్రధాన కూడళ్లలో రోడ్లపై వేసిన చెత్తను పారిశుధ్య కార్మికులు సకాలంలో తీయకపోవడంతో దోమలకు నిలయాలుగా మారుతున్నాయి. సాహెబ్‌నగర్‌లోని బతుకమ్మ కుంట వద్ద కాలనీవాసులు చెత్త కవర్లు, చికెన్, మటన్ సెంటర్ల నిర్వాహకులు వ్యర్థ పదార్థాలను వేయడంతో విపరీతమైన దుర్వాసన, దోమల పెరుగుదలతో కాలనీవాసులు అటుగా వెళ్లాలంటేనే జంకుతున్నారు.

కొత్తపేట కాలనీల్లో రోజు విడిచి రోజు పారిశుధ్య పనులు జరుగుతున్నాయి. గాయత్రీపురం ఎస్ఆర్ఎల్ కాలనీ, నాగేశ్వర్‌నగర్‌ల వద్ద రహదారుల పక్కనే పండ్ల వ్యర్థాలు చేరవేస్తున్నారు. దీంతో పరిసర కాలనీల్లో దుర్వాసనతో పాటు దోమల బెడద తలెత్తుతోంది. ఇక గోకుల్‌నగర్, శివమ్మనగర్, భరత్‌నగర్ 1, 2 రాజీవ్‌గాంధీనగర్ బస్తీల్లో తరచూ డ్రైనేజీ లీకేజీతో పాటు వర్షం నీరు రోజుల తరబడి దారుల పక్కన గుంటల్లో కొన్ని ప్రాం తాల్లో రోడ్డుపైనే నిలిచిపోతుంది, కామినేని క్రాస్ రోడ్స్ సమీపంలో గల బస్తీల్లో అక్కడక్కడా ఇరుకు దారుల్లో మురుగునీరు నిలుస్తోంది. దీంతో దోమల బెడద విపరీతంగా ఉంది.

ఎక్కడ పడితే అక్కడ చెత్త..

హయత్‌నగర్ పరిధిలోని పద్మావతికాలనీ, ఓల్డ్‌విలేజీ, రాఘవేంద్రనగర్‌కాలనీ, సత్యనారాయణకాలనీ, ముదిరాజ్‌కాలనీ, బంజారాకాలనీ, ఆర్టీసీ మజ్దూర్‌కాలనీల్లో దోమల బెడద ఎక్కువైంది. హయత్‌నగర్ బస్సు డిపో నుంచి పద్మావతి కాలనీ వైపుకు వెళ్లే రోడ్డులో హాస్టల్ ముందు చెత్తను వేస్తున్నారు. వారానికి ఒక్క సారి చెత్తను అక్కడి నుంచి తరలిస్తున్నారు. వారం రోజుల వరకు పెద్ద చెత్తకుప్పగా మారుతుంది. అదే విధంగా బొమ్మిడి నాగిరెడ్డి గార్డెన్ రోడ్డులో రోడ్డు పక్కనే చెత్తను వేస్తున్నారు. జీహెచ్‌ఎంసీ శానిటేషన్ అధికారులు దానిని తీయకపోవడంతో చెత్త పేరుకుపోతుంది. సరియైన సమయంలో చెత్తను తీయకపోవడం వల్ల స్థానికంగా దోమలు వృద్ధి చెందుతున్నాయి.

తరచూ డ్రైనేజీలు పొంగుతుండటం వల్లనే..

చంపాపేట, హస్తినాపురం డివిజన్‌లలోని ఆయా కాలనీలు, బస్తీలలో తరచూ డ్రైనేజీలు పొంగుతుండటం వల్లనే దుర్వాసన దోమల బెడదకు కారణాలు కనిపిస్తున్నాయి. చంపాపేట డివిజన్‌లోని చంపాపేట గాంధీబొమ్మ చౌరస్తా, కుమ్మరిబస్తీ, రెడ్డిబస్తీలలో తరచూ డ్రైనేజీలు పొంగుతుండటం, రెడ్డిబస్తీలో నాలాలో నుంచి డ్రైనేజీ పోతుండటం, అక్కడక్కడ ఓపెన్‌గా ఉండటంతో దోమల బెడద అధికంగా ఉంది. చంపాపేట నుంచి కర్మన్‌ఘాట్‌కు వెళ్లే సాగర్ ప్రధాన రహదారిలో ఎస్ఎన్‌రెడ్డి గార్డెన్ ముందు గత కొన్ని నెలల నుంచి డ్రైనేజీ పొంగుతుండటం వాటికి తోడు వర్షపు నీళ్లు నిలుస్తుడంటంతో చెరువును తలపిస్తుంది. హస్తినాపురం డివిజన్‌లోని నందనవనంలో ప్రధాన రహదారిపై తరచూ డ్రైనేజీలు పొంగుతుండటంతో దోమల బెడద అధికమైంది.

సైదాబాద్‌లోని ఐఎస్‌సదన్ డివిజన్ లక్ష్మీనగర్ ప్రధాన రహదారిపై సంవత్సరం కాలంగా వరద నీటి కాల్వ పనులు అసంపూర్తిగా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాల్వలో మురుగు నీరు నిలిచిపోవడంతో పాటు, పైకప్పు లేకపోవడంతో పరిసరాలు దుర్గంధంగా మారాయి. అంతేగాకుండా గోడ లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. సైదాబాద్ ఎర్రగుంట చెరువుపై పర్యవేక్షణ లేకపోవడంతో సమీప ప్రాంతాలలో నుంచి ఇళ్ల వ్యర్థాలు, మాంసవ్యర్థాలు వేస్తున్నారు.

ఓల్డ్ మలక్‌పేటలో పత్తాలేని ఫాగింగ్

ఓల్డ్‌మలక్‌పేటలో దోమల నివారణ చర్యలు శూన్యం వైద్యఆరోగ్య, జీహెచ్‌ఎంసీ సిబ్బంది సమన్వయంతో దోమల నివారణ చేపట్టాల్సి ఉంటుంది. లోతట్టు ప్రాంతాలైన పాపయ్యనగర్, దోబీబస్తీ, శంకర్‌నగర్, మున్సిపల్‌కాలనీ, మూసీ వెంట ఉండే ప్రాంతాల్లో దోమల బెడద అధికంగా ఉంది. అధికారులు దోమల నివారణకు కాలనీల్లో ఫాగింగ్ చేయాలని ప్రజలు కోరుతున్నారు.



గ్రీన్‌పార్క్‌కాలనీ వద్ద పేరుకుపోయిన మురుగు

చెత్త కుప్పలతో పెరుగుతున్న దోమలు..



పారిశుధ్య కార్మికుల నిర్లక్ష్యంతో కాలనీలో రోడ్డు పక్కల చెత్త కుప్పలతో దోమలు పెరుగుతున్నాయి. దీంతో మధ్యాహ్నం, రాత్రి వేళల్లో దోమల తీవ్రతతో చిన్నపిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. పారిశుధ్య కార్మికులు సకాలంలో రోడ్లు, ఇతర ఖాళీ ప్రదేశాల్లో ఉండే చెత్త, ఇతర వ్యర్థ పదార్థాలను తీసివేయాలని కోరుతున్నారు.

- అశ్విని ఆంజనేయులు, వనస్థలిపురం

చెత్తను తొలగించని పారిశుధ్య కార్మికులు



పారిశుధ్య కార్మికులు తమకు అనుకూలంగా ఉన్న కాలనీల్లో మాత్రమే రోడ్లపై ఉన్న చెత్తను సకాలంలో తీసివేస్తున్నారు. ఇతర కాలనీల్లో మాత్రం పట్టించుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని చెత్తను ఊడ్చిన వెంటనే చెత్తను తీసివేయాలి. రోడ్లపై పడిన గుంతలను సంబంధిత అధికారులు పూడ్చివేస్తే దోమలను నివారించవచ్చు.

- పోగుల రాంబాబు, వైదేహినగర్ నార్త్ కాలనీ

దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టాలి



భరత్‌నగర్ బస్తీలో పారిశుధ్య పనులు/స్వీపింగ్ రోజు విడిచి రోజు చేస్తున్నారు. కుళ్లిపోయిన కూరగాయలు, ఇతర వ్యర్థాలు పరిసరాల్లో వేస్తుండటంతో, దోమల బెడద విపరీతంగా ఉంది. ఓపెన్ ఏరియాల్లోకి వ్యర్థాలు చేరవేస్తున్నారు. ఫిర్యాదు చేసినప్పుడు పారశుధ్య విభాగం సిబ్బంది తొలగిస్తున్నారు. కానీ సాయంత్రమయ్యే సరికి దోమలు ఇళ్లలోకి చేరుతున్నాయి. ఫాగింగ్ తరచూ చేసేలా చర్యలు తీసుకోవాలి.

- సీహెచ్.నాగరాజు, భరత్‌నగర్

చంపాపేటలో జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆకస్మిక తనిఖీలు

చంపాపేట, జూలై 5(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్‌లోని మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్, మోడల్ మార్కెట్‌ను శుక్రవారం ఉదయం జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి ఆకస్మిక తనిఖీలు చేశారు. చంపాపేటలోని మోడల్ మార్కెట్‌లోని షటర్లు ఎన్ని అద్దెకు ఇచ్చారని కమిషనర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అక్కడే ఉన్న మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్‌ను కమిషనర్ పరిశీలించారు. ఫంక్షన్‌హాల్‌లో మిగిలిపోయిన అసంపూర్తి పనులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్‌లో అసంపూర్తిగా ఉన్న పెయింటింగ్, మెట్ల పనులపై ప్రతిపాదనలు పంపాలని, మోడల్ మార్కెట్‌లో ఖాళీగా ఉన్న షటర్లను ఉపయోగంలోకి వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పారిశుధ్య నిర్వహణను సక్రమంగా చేపట్టాలని శానిటేషన్ అధికారులను ఆదేశించారు. ప్రజావాణిలో ప్రజల నుంచి వచ్చే వినతులను స్వీకరించి ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. కమిషనర్ వెంట జీహెచ్‌ఎంసీ ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, ఎల్బీనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జకియా సుల్తానా, డీసీఎస్‌డబ్ల్యూయం సువార్త, డిప్యూటీ ఎస్టేట్ ఆఫీసర్ విజయలక్ష్మి, శానిటేషన్ డీఈ వెంకటేశ్వర్లు, ఆయా శాఖల అధికారులు తదితరులు ఉన్నారు.



చంపాపేటలోని మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్‌ను పరిశీలిస్తున్న జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి

వనమహోత్సవంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలి

● మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి

సరూర్‌నగర్, జూలై 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పచ్చదనం పెంపొందించే లక్ష్యంతో చేపట్టిన వనమహోత్సవంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై పర్యావరణ పరిరక్షణకు చేయూతనివ్వాలని మహేశ్వరం ఎమ్మెల్యే పీ.సబితారెడ్డి అన్నారు. వనమహోత్సవంలో భాగంగా శుక్రవారం మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని మంత్రాలచెరువు వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మేయర్ ఎం.దుర్గాదీప్‌లాల్, డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్‌రెడ్డి, కమిషనర్ చంద్రశేఖర్‌తో కలిసి మొక్కలు నాటి నీరు పోశారు. అనంతరం సబిత మాట్లాడుతూ గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం హరితహారం పేరుతో మొక్కల పెంపకాన్ని ఓ ఉద్యమంలా చేపట్టి రాష్ట్రాన్ని హరితమయం చేసిందని, ప్రస్తుత ప్రభుత్వం సైతం అదే తరహాలో మొక్కల పెంపకాన్ని పెద్ద ఎత్తున చేపట్టాలని సూచించారు. కాలనీవాసులు తమ నివాస గృహాల్లో, కాలనీ రోడ్లపై మొక్కలు నాటుకోవాలని ఆమె అన్నారు. కార్యక్రమంలో కౌన్సిల్ బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి, డీఈఈ వెంకన్న, ఎఫ్ఆర్‌ఓ సుధీర్, ఆర్వో అంజన్‌రెడ్డి, బీఆర్ఎస్ మీర్‌పేట్ శాఖ అధ్యక్షుడు కామేశ్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ దిండు భూపేశ్‌గౌడ్ పలు డివిజన్ల కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, స్థానిక నాయకులు, మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

వనస్థలిపురం: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. శుక్రవారం మన్సూరాబాద్ డివిజన్ సెంట్రల్ బ్యాంక్‌కాలనీలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మొక్కలు నాటి అనంతరం మాట్లాడుతూ కాలుష్యంలేని నవ సమాజ నిర్మాణానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు, నాయకులు పాల్గొన్నారు.



మంత్రాలచెరువు వద్ద వనమహోత్సవంలో సబితారెడ్డి

అమ్మ పేరుతో మొక్కను నాటిన కార్పొరేటర్

చాదర్‌ఘాట్: మూసారాంబాగ్ డివిజన్‌లోని ఫ్రెండ్స్ కాలనీలో గల ఓ పాఠశాలలో అమ్మ పేరుతో ఒక మొక్కను కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీరెడ్డి శుక్రవారం నాటారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రధాని మోదీ కొత్తగా నినాదం చేశారని, అమ్మ పేరుతో ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటాలన్న ఆలోచన అద్భుతమైందన్నారు. నాటిన మొక్కలను అమ్మలాగా కాపాడుకోవాలన్న సూచనలను కూడా పాటించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ యూబీడీ సూపర్‌వైజర్ కృష్ణ, వర్క్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణకారుల సమస్యలను పరిష్కరించాలని మంత్రికి వినతి

చంపాపేట, జూలై 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో స్వర్ణకారులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం రాష్ట్ర స్వర్ణకార సంఘం అధ్యక్షుడు వింజమూరి రాఘవాచారి ఆధ్వర్యంలో రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమా ఫొటోగ్రాఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాఘవాచారి మాట్లాడుతూ తమిళనాడు తరహా వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని, జీవో నెం. 272ను సవరించి తెలంగాణ రాష్ట్రంలో అమలు చేయాలని మంత్రిని కోరినట్లు పేర్కొన్నారు. పుస్తె మెట్టెలు కార్పొరేట్ జ్యువెలరీలో కాకుండా స్వర్ణకారులు తయారు చేసే విధంగా జీవో అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటస్వామి, రాష్ట్ర సహాయ కార్యదర్శి రమేష్‌చారి, గౌరవ సలహాదారులు రత్నమాచారి, జీవి రమణ, నారాయణదాసు, సతీష్‌చారి పాల్గొన్నారు.



మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న రాష్ట్ర స్వర్ణకార సంఘం అధ్యక్షుడు వింజమూరి రాఘవాచారి తదితరులు

పాము కాటుకు గురై ఉస్మానియాలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

అబ్దుల్లాపూర్‌మెట్, జూలై 5(ఆంధ్రజ్యోతి): పాము కాటుకు గురైన వ్యక్తి ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారు జామున మృతి చెందిన సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. లష్కర్‌గూడ గ్రామానికి చెందిన బిజిలి ప్రవీణ్‌కుమార్ (28)కి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. కాగా గత నెల 20న గ్రామ సమీపంలోని వ్యవసాయ బావి వద్దకు వెళ్తుండగా గుర్తు తెలియని పాము కుడి కాలుపై కాటు వేసింది. ఆ తర్వాత రెండు రోజుల పాటు నాటు వైద్యం తీసుకున్నాడు. అనంతరం హయత్‌నగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరాడు. అయితే పరిస్థితి విషమించడంతో ఈనెల 3న ఉస్మానియా జనరల్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారు జామున మృతిచెందాడు. ఈ మేరకు అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆంగ్లనాటకస్థాయిలో ఇనాక్ నాటకాలు



ప్రసంగిస్తున్న మధుసూదనాచారి

చిక్కడపల్లి: ఇనాక్ తెలుగు నాటకాలు షేక్స్పియర్ ఆంగ్లనాటక స్థాయి లో ఉంటాయని ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి అన్నారు. త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో జరుగుతున్న ఆచార్య కొలకలూరి ఇనాక్ సాహితీ సమాలోచన సప్తాహంలో భాగంగా ఇనాక్ నాటక రచనపై ప్రసంగ కార్యక్రమం గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగింది. మధుసూదనాచారి మాట్లాడుతూ ఆర్థికంగా, సామాజికంగా ప్రతికూల వాతావరణంలో తనను తాను తీర్చిదిద్దుకున్న శిల్పి ఇనాక్ అని అన్నారు. ప్రముఖ నాటక రచయిత ప్రయోక్త పాటిబండ్ల ఆనందరావు కీలకప్రసంగం చేస్తూ వర్తమాన సమాజానికి దారి, దీపం చూపని రచనలు వ్యర్థం అన్న ఆలోచన ఇనాక్ తన ప్రతి నాటకంలో నిర్భయంగా తెలిపారని విశ్లేషించారు. తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షుడు డా. నాళేశ్వరం శంకరం మాట్లాడారు. గానసభ కార్యవర్గసభ్యులు జంగంరావుగౌడ్, ప్రసాద్, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.



హైదరాబాద్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న గోవర్దన్ తదితరులు

దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలని హైదరాబాద్ కలెక్టర్‌కు వీహెచ్‌పీఎస్ వినతి

అబ్దుల్లాపూర్‌మెట్, జూలై 5(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వీహెచ్‌పీస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెలిమండ్ల గోవర్ధన్ ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్ కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా గోవర్ధన్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ దివ్యాంగులకు రూ. 6వేలు, వృద్ధులు, వితంతులకు రూ.4వేల పింఛన్ ఇస్తామని హామీ ఇచ్చిందని వెంటనే దాన్ని అమలు చేయాలని కోరారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తమకు న్యాయం జరిగేలా కృషి చేయాలని కోరారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, అన్ని ప్రభుత్వ రంగాల్లో 4శాతం రిజర్వేషన్లు కల్పించాలని, స్థానిక సంస్థల్లో 5శాతం రిజర్వేషన్, రాష్ట్ర బడ్జెట్‌లో వికలాంగులకు 5శాతం నిధులను కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జాతీయ అధ్యక్షులు ఎల్. గోపాల్, వెంకటేశ్, సుభద్రమ్మ, చంద్రకళ, సువర్ణ, పవన్, సత్యనారాయణ, జసవరాజ్, జగదీష్ పాల్గొన్నారు.

ప్రైవేట్ విద్యాసంస్థల తీరు మారట్లేదు: యాదగిరి


వనస్థలిపురం, జూలై 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు మారుతున్నా ప్రైవేట్ విద్యాసంస్థల తీరు మారట్లేదని బీఎస్పీ ఎల్బీనగర్ ఇన్‌చార్జి జక్క యాదగిరి ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఎల్బీనగర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద బీఎస్పీ నాయకులతో కలిసి యాదగిరి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండున్నర దశాబ్దాలుగా ప్రైవేట్ స్కూల్లు, కార్పొరేట్ విద్యాసంస్థలు అడ్డు, అదుపు లేకుండా విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేస్తూ సామాన్యుల నడ్డి విరుస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు వినయ్, స్వామి ఆనగల్ల, అనిల్‌యాదవ్, అశోక్, సత్యంచారి పాల్గొన్నారు.

బీజేవైఎం నేతల ముందస్తు అరెస్టులు

సైదాబాద్, జూలై 5(ఆంధ్రజ్యోతి): బీజేవైఎం, బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో నిరుద్యోగ జేఏసీ శుక్రవారం టీజీపీఎస్సీ కార్యాలయం ముట్టడి పిలుపు నేపథ్యంలో సైదాబాద్‌లోని బీజేవైఎం నేతలను ముందస్తు అరెస్ట్ చేసి పీఎస్‌కు తరలించారు. అరెస్ట్ కాబడిన భాగ్యనగర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి, నగర మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్జీ, ఉపాధ్యక్షులు నిరంజన్‌యాదవ్, కోళ్లగోపిలు కలిసి సంఘీభావం ప్రకటించారు. అరెస్ట్ అయిన వారిలో రమణ్‌సింగ్, నవీన్ బండారి, దినేష్ గోలికార్, ఆశీష్, సందీప్‌సాగర్ తదితరులు ఉన్నారు.

హయత్‌నగర్‌లో భారీ వర్షం

హయత్‌నగర్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం సాయంత్రం 20 నిముషాల పాటు భారీ వర్షం కురిసింది. దీంతో ఆయా కాలనీల్లో రోడ్లన్ని జలమయమయ్యాయి. వరద నీరు లోతట్టు ప్రాంతాల్లోకి చేరింది. పద్మావతి, రాఘవేంద్రకాలనీ, అరుణోదయకాలనీ, బీడీఎల్ కాలనీలో భారీగా వరద నీరు ప్రవహించింది. కుమ్మరికుంటలోకి పై కాలనీల నుంచి వరద నీరు భారీగా వచ్చి చేరింది. విజయవాడ జాతీయ రహదారి పైన కూడా అక్కడక్కడ వర్షం నీరు నిలిచింది.



విజయవాడ జాతీయ రహదారిపైన నిలిచిన నీరు

నేటి నుండి వారాహిదేవి నవరాత్రి ఉత్సవాలు

ఎల్బీనగర్, జూలై 5(ఆంధ్రజ్యోతి): వారాహిదేవి నవరాత్రి ఉత్సవాలు శనివారం నుండి ప్రారంభం కానున్నాయి. నవరాత్రి ఉత్సవాల కోసం ఆర్‌కేపురంలోని కుర్తాళం పీఠం ఆదిపరాశక్తి ప్రత్యంగిరా పరమేశ్వరి ఆలయం ముస్తాబైంది. కుర్తాళం పీఠాధిపతులు జగద్గురువులు సిద్ధేశ్వరానంద భారతి మహాస్వామి ఆశీస్సులతో శనివారం నుండి జూలై 14 వరకు నవరాత్రి ఉత్సవాలు జరగనున్నాయి. నవరాత్రుల్లో ప్రతి రోజు ఉదయం విశేష అభిషేకం, అనంతరం మహిళలచే కుంకుమార్చన తదితర కార్యక్రమాలు జరుగుతాయని ఆలయ కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు.

వెంకటేశ్వరకాలనీలో కార్పొరేటర్ పర్యటన

ఎల్బీనగర్: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు స్వయంగా పరిశీలించేందుకు సరూర్‌నగర్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అంజన్ గుడ్ మార్నింగ్ సరూర్‌నగర్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా శుక్రవారం జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులతో కలిసి వెంకటేశ్వరకాలనీలో ఆమె పర్యటించారు. కాలనీవాసులు తమ సమస్యలను ఆమెకు వివరించారు. కాలనీవాసుల సమస్యలను అక్కడే ఉన్న అధికారులకు వివరించి తక్షణమే పరిష్కరించాలని సూచించారు.